# వివేకవంతుడు

మల్లాది వెంకటకృష్ణమూర్తి



ఎప్పుడోకాని కాక్‌టెయిల్ పార్టీలకు అలాంటి వాళ్లకి ఆహ్వానం రాదు. కోనేటిరావుకి ఓ కార్పొరేట్ కంపెనీ నుంచి దాదాపు పదిహేను రూపాయల ఖరీదు చేసే ఆహ్వాన పత్రం వచ్చింది.

మర్నాడు సాయంత్రం కృష్ణా ఒబెరాయ్‌లోని కాక్‌టెయిల్ రూంలో జరిగే పార్టీకి రమ్మని. డ్రస్ కోడ్ ఇన్‌ఫార్మల్ అని. కోనేటిరావు ఆ కంపెనీకి ఫోన్ చేసి కనుక్కున్నాడు ఇన్‌ఫార్మల్ డ్రస్ అంటే ఏమిటని. కాజువల్ వేర్ అని సమాధానం వచ్చింది.

"కాజువల్ వేర్ అంటే?" అడిగాడు అతను.

"మీరెక్కడి నుంచి మాట్లాడుతున్నారు?" అవతల నుంచి అడిగారు.

"ఆఫీస్ నుంచి."

"ఇప్పుడు మీరు వేసుకున్న దుస్తులే కాజువల్ వేర్ అంటే."

❋ ❋ ❋

ఓ బ్లడ్ మేరీ గ్లాస్ పట్టుకుని కోనేటిరావు అక్కడికి వచ్చిన వాళ్ల వంక చూశాడు. ఎక్కువ మంది నార్త్ ఇండియన్స్. సూట్లలో ఉన్న వాళ్లే అధికం. తనలా కాజువల్ వేర్‌లో ఉన్న వాళ్ల కోసం చూశాడు. తన వయసుకి రెట్టింపు వయసు గల ఓ పెద్ద మనిషి కనపడ్డాడు ఖద్దరు పేంట్, బంగారం రంగు ఖద్దరు చొక్కాలో. ఆయన చేతిలో విస్కీ గ్లాసుంది. విస్కీ నిండా ఐసు ముక్కలు.

వచ్చిన వాళ్లలో అంతా తలోకరితో మాట్లాడుతున్నారు. తనలా ఆ ఖద్దరాయనకి ఎవరూ పరిచయస్థులు లేనట్లున్నారు. తెలిసిన ముఖం కోసం వెదుకుతున్నట్లుగా ఆయన కళ్లు చూడటం గుర్తించి కోనేటిరావు ఆయన దగ్గరికి వెళ్లారు.

"నమస్తే. మీరు లాయరు అనుకుంటాను?" అడిగాడు.

"అవును. నా మొహంలోని ఇంటలిజెన్స్‌ని చూసి గుర్తించారా?" గర్వంతో కూడిన చిరునవ్వుతో అడిగాడతను.

"కాదు. మీకు మిత్రులంటూ ఎవరూ లేకపోతే అనుకున్నా. నేను ఆర్టీసిలో అడ్మినిస్ట్రేషన్ సెక్షన్‌లో క్లర్క్‌ని." పరిచయం చేసుకున్నాడు కోనేటిరావు తన పేరు కూడా చెప్పుకుని.

"ఆర్టీసీ వాళ్లకి మిత్రులు లేకపోవడంలో ఆశ్చర్యం లేదు."

"అవును. ఈ మధ్య టిక్కెట్ల రేట్లు పెంచాక కదా" ఒప్పుకున్నాడు కోనేటిరావు.

ఇద్దరూ చెరో గుక్క తాగాక అడిగాడు కోనేటిరావు.

"మీరు దేంట్లోనయినా స్పెషలైజ్ చేశారా? ఐ మీన్, ఏ లా ప్రాక్టీస్ చేస్తారు?"

"డైవర్స్ లా."

"ఓ."

కోనేటిరావు కొద్దిసేపు నిశ్శబ్దంగా ఆలోచించాడు. తర్వాత కనుబొమలు ముడిచి అడిగాడు.

"మీ సలహా కావాలి నాకు."

"అడగండి."

"ఫ్రీయేనా? లేక ఫీజు..."

"మీరు మా ఆఫీసుకి వచ్చి అడగలేదుగా? మనిద్దరం ఫిక్సెడ్ డిపాజిట్స్ చేసిన కంపెనీ డిపాజిట్‌దార్ల గౌరవార్థం ఇచ్చే పార్టీలో కలుసుకుని మాట్లాడుకుంటున్నాం కాబట్టి ఫీజు అక్కర్లేదు. ఫ్రీయే."

"థాంక్ గాడ్."

"అడగండి."

కోనేటిరావు నెమ్మదిగా చెప్పాడు.

"ఈ సిట్యుయేషన్‌లో ఏం చేయాలో చెప్పండి."

"ఏ సిట్యుయేషన్‌లో?"

"చెప్పనీయండి నన్ను. ఓ భార్యకి తన భర్త మీద కోపం, ఉద్యోగంలో వచ్చేది కాకుండా అదనంగా సంపాయించలేదని. వాడూ పాపం ప్రయత్నించాడు కాని హర్షద్ మెహతా దయవల్ల ఇన్‌వెస్ట్ చేసిందంతా గోవిందా అయింది. తెగదెప్పుతోంది ఆ భర్తని ఈ విషయంలో."

"అర్థమైంది. ఫిక్సెడ్ డిపాజిట్‌లో పెట్టి సంపాయించడం మగతనం అనుకోకండి. మూలనున్న ముసలమ్మ కూడా ఆ పని చేయగలదు. ఇంటరెస్ట్ రేట్‌కన్నా ఎక్కువ సంపాదించడమండి మగతనమంటే." లాయర్‌గారు గయ్యాళి, మరియు దెప్పే భార్య కంఠాన్ని అనుకరించి మాట్లాడారు.

"కరెక్ట్. అచ్చం ఇలాగే — ఇలాంటి భా ్రే విషయంలో మీ సలహా కావాలి." కోరాడు కోనేటిరావు.

ఆలోచనగా గడ్డం నిమురుకున్నాడు లాయర్ కొద్ది క్షణాలు. తర్వాత విస్కీ ఓ గుక్క తాగి చెప్పాడు.

"నా సలహా విడాకులు. అలాంటి గయ్యాళి భార్యతో జీవిస్తే బి.పి, హార్ట్ అటాక్ తథ్యం."

"కాకపోతే ఆమె అతన్ని గాఢంగా ప్రేమిస్తోంది. తన భర్త అన్నదమ్ములకన్నా అతగాడు ఎక్కువ సంపాదించాలన్న కాంక్ష వల్లే అలా దెప్పుతుంది తప్ప మరే ఇతర కారణం వల్ల కాదు."

"అలాంటప్పుడు విడాకులు వద్దని నా సలహా."



"రాత్రి మా ఆయన తాగొచ్చారులాగుంది."

"ఎలా తెలుసు?"

"రాత్రి అన్నీ నిజాలే చెప్పారు."

కలపర్తి సత్యం (ఏలూరు)

---

"కాకపోతే... ఎలా చెప్పను? ఆ... ఆ కోపంతో వంట సరిగ్గా చెయ్యదు. కాకరకాయ పులుసు, వంకాయ కూర చేయమని ఆ భర్త కోరితే, వంకాయ పులుసు, కాకరకాయ కూర చేస్తుంది. చెముడు కాదు. కావాలని. గుడ్డిది కాదు కావాలని ఉప్పు ఎక్కువో లేక తక్కువో వేస్తుంది. కాఫీలో చక్కెర చాలదు. టీలో చక్కెర ఎక్కువవుతుంది."

లాయరు గెడ్డం ఎక్కువ సేపు నిమురుకున్నాడు.

"ఆడపడుచులు తమింటికి వచ్చినా, రాకపోయినా ఏడాదికోసారి చీర జాకెట్టు, పసుపు కుంకుమ పోస్ట్ ద్వారా పంపుతుంటుంది. రెండు వారాలకో ఉత్తరం అత్తగారికి, ఆవిడ ఆరోగ్యం గురించి ఎంక్వయిరీ చేస్తూ రాస్తూంటుంది. అత్తింటి వైపు వాళ్లు ఎవరొచ్చినా, ఎన్ని రోజులున్నా విసుక్కోకుండా అన్నీ చేసిపెడుతుం ది వాళ్లు అటు ఆవగింజంతేసి ఇటు పెడతానన్నా ఒప్పుకోదు."

ఈసారి తక్కువసేపు నిమురుకున్నాడు లాయర్.

"అలాంటప్పుడు విడాకుల ఆలోచన మానుకోమని నా సలహా."

"ఒక్కచోటే వస్తోందండి పెద్ద చిక్కు. భర్త అయిదారు నిముషాలు ఆలస్యంగా వస్తే చాలు. ఎవత్తెతో తిరిగి వస్తున్నారని విరుచుకుపడుతుంది. ఆఫీస్ క్యాంప్‌కి భర్త వెళ్తే 'అది నిజమా, కాదా, ఎవరెవరు వెళ్లారు, ఆ బీ—టు క్లర్క్ కూడా వెళ్లిందా' అంటూ ఆఫీసుకెళ్లి అన్ని ఆరాలు తీస్తుంది. అనుమానం భార్యతో వేగడం కష్టమండి. ఆఫీసులో అందరిముందూ తల కొట్టేసినట్టుగా ఉంటుంది."

"ముందే చెప్పలేదే ఇది మరి? అలాంటి, భార్య ఉన్న భర్తకి నా సలహా ఒకటే. విడాకులు. ఆ భర్త బీ—టు క్లర్క్‌తో తిరగకపోయినా సరే. విడాకులే మందు."

"కాని ఆమె మాత్రం ఇల్లు అద్దంలా ఉంచుతుందండి. దుమ్మునేది, బూజనేది చూద్దామన్నా కనపడదు. అయిదున్నరేళ్ల క్రితం కొన్న ఇత్తడి గిన్నె కూడా నిన్న కొన్నారా అనిపించేలా తళతళలాడుతుంటుంది. అదిగో ఆ మూలనిలబడ్డ బట్టతలలా. ఏ వస్తువు ఎక్కడ ఉండాలో అక్కడే ఉంటుంది. షి ఈజ్ సింప్లీ ఏ గుడ్ హౌస్ కీపర్."

ఈసారి ఎప్పటికన్నా ఎక్కువసార్లు గెడ్డం నిమురుకున్నాడు లాయర్. యు.ఎన్.ఒలో ఉన్నాడా, అంతర్జాతీయ సమస్య గురించి ఆలోచిస్తున్నాడా అనిపించక మానదు ఆయన ముఖ కవళికల్ని ఎవరయినా గమనిస్తే. విస్కీని పూర్తి చేసి ఇంకో గ్లాసు అందుకుని చెప్పాడు.

"డైవర్స్ ఈజ్ అవుట్. అలాంటి భర్తకి డైవర్స్ ఇవ్వద్దు."

"ఇది విని చివరిగా ఏం చేద్దామంటారో చెప్పండి. భర్తకి తెలియకుండా పుట్టింటికి బియ్యం, ఉప్పు, పప్పు, పాతబట్టలు, డబ్బు పంపిస్తుంటుంది. ఆ భార్య తమ్ముడికి చదువు అబ్బలేదు. ఎప్పుడూ కేరమ్స్ ఆడుతూ గడుపుతుంటాడు. సిగరెట్లకి డబ్బు ఈమె ఇవ్వాల్సిందే."

"ఆగండాగండి. పుట్టింటి వాళ్లకి దోచిపెట్టే ఇలాంటి భార్యలకి అనేకసార్లు భర్తలచేత విడాకులిప్పించాను. దానికదే మందు."

"కాని పిల్లల మాటేమిటి?"

"పిల్లల మాటేమిటి ఏమిటి?" అడిగాడు లాయర్.

"వాళ్లకి ముగ్గురు పిల్లలు."

"ఓ. ఎంత వాళ్ల వయస్సు?"

"ఏడు, నాలుగు, రెండు."

"నాలుగు తర్వాత ఒకటి కాదా? మూడేళ్ల ఎడం ఉండాలని కదా ఫేమిలీ ప్లానింగ్ వాళ్లు చెప్పేది?"

"అది నిజమే కానండి ఓ రాత్రి వర్షం వచ్చి కరెంట్ పోవడంతో లెక్క తప్పింది."

"అర్థమయ్యేలా చెప్పు."

"కండోమ్స్ స్టాక్ అయిపోతే వర్షం వల్ల, చీకటి వల్ల అతగాడు మెడికల్ షాపుకి వెళ్లలేదు. పైగా 'ఏం కాదులెండి ఒక్కసారికి' అని ఆ భార్య నమ్మకంగా చెప్పట కూడా లెక్క తప్పింది."

"ఇంతకీ మీకు పెళ్లయి ఎన్నేళ్లయింది?" అడిగాడు లాయర్.

"నాకు పెళ్లయిందని ఎవరన్నారు? నేను బ్రహ్మచారినే."

"మరి ఈ ప్రశ్నలన్నీ ఎందుకడిగారు?" తెల్లబోతూ అడిగాడు లాయర్.

"పెళ్లి చేసుకోమని మా అమ్మ గొడవ పెడుతోంది. పెళ్లయ్యాక జరిగే అన్ని పాసిబిలిటీస్‌ని అంచనా వేస్తున్నాను ఎలాగూ ఫ్రీగా దొరికేది కదా అని." జవాబు చెప్పాడు కోనేటిరావు. ఇంకో బ్లడ్‌మేరి అందుకుని.